14032024-DIS-04_Layout 1 3/14/2024 1:03 AM Page 1



# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## మత పౌరసత్వం

**దేశంలో** సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉన్నపళంగా వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ - సీఏఏ) బయటకు తీయడంపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేవలం మత ప్రాతిపదిక మీద పౌరసత్వం కల్పించే ఈ చట్టం 2019లో ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. ఇంకా నిబంధనలు నోటిఫై చేయలేదంటూ ఇప్పటిదాకా కేంద్రం దీన్ని తాత్కాలికంగా చాప కింద పెట్టింది. ఈ చట్టం అమల్లోకి రాకుండా స్టే విధించాలని కోరుతూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇంకా నిబంధనలు రూపొందించలేదనే కారణంతో సీఏఏపై సుప్రీంకోర్టు స్టే విధించకుండా కేంద్రం అడ్డుకున్నదని ఆ పిటిషన్‌లో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ తెలియజేయడం గమనార్హం. గత నాలుగున్నరేండ్లలో ఈ చట్టం నిలుపుదలను కోరుతూ 250కి పైగా పిటిషన్లు దాఖలు కావడం దీనిపై తలెత్తిన వ్యతిరేకతకు అద్దం పడుతున్నది. సీఏఏ చట్టం పూర్తిగా వివక్షాపూరితంగా ఉన్నట్టు అగ్రరాజ్యం అమెరికా, ఐక్యరాజ్య సమితి కూడా విమర్శిస్తున్నాయి. పౌరసత్వం మంజూరులో ముస్లింలను మినహాయించడం రాజ్యాంగానికి పూర్తి విరుద్ధమని దేశంలోని మానవ హక్కుల సంఘాలూ వాదిస్తున్నాయి. ఎన్నికలకు ముందే ఈ చట్టాన్ని అమలు చేయవచ్చని గత కొన్ని నెలలుగా బీజేపీ నుంచి సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో సోమవారం నాటి ప్రకటన చాలామందికి ఆశ్చర్యం కలిగించలేదు.

నోటిఫికేషన్ జారీ అయిన తర్వాత 'జో కహా సో కియా' (మేము చెప్పింది చేశాము) అని సోషల్ మీడియాలో బీజేపీ ప్రచారం చేసుకుంటున్నది. మరోవైపు కాంగ్రెస్ సహా విపక్షాలు, విపక్ష పాలిత రాష్ర్టాలు నోటిఫికేషన్‌పై భగ్గుమంటున్నాయి. అస్సోం సహా కొన్ని రాష్ర్టాల్లో సీఏఏకు వ్యతిరేకంగా నిరసనలు మొదలయ్యాయి. కేరళ, బెంగాల్, తమిళనాడు ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీన్ని తాము అమలు చేయబోమని తెగేసి చెప్తున్నాయి. అయితే పౌరసత్వం కేంద్ర పరిధిలోని అంశం కనుక ఆచరణలో ఇది సాధ్యం కాకపోవచ్చని కొందరు అంటున్నారు. ఈ చట్టంపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా తీవ్రంగా విమర్శించారు. పౌరసత్వాన్ని మతంతో ముడిపెట్టడం ఈ చట్టం ప్రత్యేకత. స్వతంత్ర భారత చరిత్రలో ఇలాంటిది ఎప్పుడూ జరగలేదు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల్లో అణచివేతకు గురైన మతపరమైన మైనారిటీలకు భారతదేశ పౌరసత్వాన్ని ఇచ్చేందుకు 'పౌరసత్వ చట్టం-1955'ను సవరించి ఈ కొత్త చట్టాన్ని తెచ్చారు. ఆయా దేశాల నుంచి వచ్చిన మైనారిటీ హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులు ఈ చట్టం ద్వారా పౌరసత్వం పొందవచ్చు. అయితే ఆయా దేశాల నుంచి వచ్చిన ముస్లింలకు మాత్రం ఆ అవకాశం ఉండదు. ఈ చట్టం 2019లో పార్లమెంటు ఆమోదం పొందినప్పుడు తీవ్రస్థాయిలో నిరసనలు వెల్లువెత్తాయి. హింసాత్మక ఘటనల్లో పలువురు మరణించగా, అనేకమంది గాయాలపాలయ్యారు. వేల మంది నిరసనకారులు అరెస్టు అయ్యారు. చట్టం కింద నిబంధనలు ప్రకటించకపోవడంతో అవి సద్దుమణిగాయి. తాజాగా నిబంధనలు నోటిఫై చేయడంపై విపక్షాలు విమర్శలు సంధిస్తున్నాయి.

గమ్మత్తయిన విషయమేమంటే ఈ కొత్త చట్టం ముస్లిమేతర దేశాల నుంచి వచ్చే శరణార్థులకు పౌరసత్వం కల్పించదు. శ్రీలంక నుంచి వచ్చే తమిళ శరణార్థులకు, మయన్మార్ నుంచి వచ్చే రోహింగ్యాలకు ఇది ఊరట కలిగించదు. మరోవైపు ప్రతిపాదిత జాతీయ సిటిజెన్ రిజిస్టర్‌తో కలిపి ప్రయోగించినప్పుడు ఇది దేశంలోని 20 కోట్ల మంది ముస్లింలను అణచివేసే సాధనంగా మారుతుందనే ఆందోళన వ్యక్తమవుతుండటం తెలిసిందే. ఈ చట్టం కేవలం ముస్లింలను లక్ష్యంగా చేసుకుని రూపొందించారని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ గతంలోనే దుయ్యబట్టారు. ఈ చట్టాన్ని అమలు చేయడం వల్ల వలసల వరదకు గేట్లెత్తినట్టు అవుతుందని భారత సరిహద్దులకు సమీపంలో నివసించేవారితో సహా ఇతర ప్రాంతాలవారూ హెచ్చరిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో హిందూ ఓట్లను ప్రభావితం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఏకాభిప్రాయ సాధన ద్వారా అమలు చేయాల్సిన అంశాలపై కేంద్రం ఒంటెత్తుపోకడలకు పోవడం ఏమాత్రం సమర్థనీయం కాదు. సుప్రీంకోర్టు నిర్ణయం వెలువడేలోగా అఖిలపక్షం నిర్వహించి చట్టం అమలుపై చర్చించాలి. ఈలోగా తాత్కాలికంగానైనా సీఏఏ అమలును నిలిపివేయడం ఉత్తమం.

# ప్రాంతీయ పార్టీలతోనే బీసీలకు న్యాయం

**కులగణన అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. జనగణనతో పాటు కులగణన చేపట్టాలనే డిమాండూ ఊపందుకుంటున్నది. ఒక్కో రాష్ట్రం, సమాజంలో అణగారిన ఒక్కో వర్గం తమ గొంతును బలంగా వినిపిస్తున్నది. ముక్తకంఠంతో కేంద్రాన్ని నిలదీస్తున్నది. అయినా కేంద్ర సర్కారులో ఏ మాత్రం చలనం కనిపించని దుస్థితి. ఇక రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సైతం బీసీలను మోసం చేయాలని చూస్తున్నది. కులగణన అంశాన్ని ఆ పార్టీ రాజకీయ స్వార్థానికి వాడుకుంటున్నది. కులగణనకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి, తెలంగాణ సామాజిక, రాజకీయ, ఆర్థిక సర్వే నిర్వహిస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసింది.**

**అయినా అందుకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయకుండా కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ కాలయాపన చేస్తున్నది. ఇది అట్టడుగువర్గాల ఆకాంక్షలను, ఆశలను నీరుగార్చే ప్రయత్నమే. అసలు అణగారిన వర్గాలు ఎందుకింతగా పట్టుబడుతున్నాయి? అయినా కేంద్రం ఎందుకు ససేమిరా అంటున్నది? కులగణన ఫలితంగా ఆయా వర్గాలకు ఒనగూరే ప్రయోజనాలేమిటి? కేంద్ర సర్కారుకు వాటిల్లే నష్టమేమిటి? అన్నవే అసలు ప్రశ్నలు. వాటి గురించి ఆలోచించాల్సిన అవసరమే కాదు, లోతుగా తర్కించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉన్నది. అప్పుడు గానీ కులగణన డిమాండ్ వెనుక ఉన్న ఆంతర్యం, ఆకాంక్షలను చిదిమేయడం వెనుక దాగిన కుట్రలు తేటతెల్లం కావు. వాటిని సంక్షిప్తంగానైనా వివరించాలన్నదే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం.**



**గోసుల శ్రీనివాస్ యాదవ్**
98498 16817



ప్రపంచంలో ఎక్కడా లేనిది, భారతావనికి మాత్రమే పరిమితమైనది, పుట్టుకకు ముందే నిర్ణయమయ్యేది, పుడమిలో కలిసినా మారనిది కులం. సమాజ పరిణామ క్రమలో వృత్తుల మూలంగా, శ్రమ విభజన ఫలితంగా పురుడుపోసుకున్నది కులం. భారతీయ సమాజం పురోభివృద్ధికి, స్వయం సమృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో వెన్నెముకగా నిలిచినది కులం. అదంతా గతం. అయినా అదే చారిత్రక సత్యం. యాంత్రిక విప్లవంతో కులవృత్తులు చెదిరిపోయాయి. వాటి ప్రాభవం మసకబారింది. కొత్త పెట్టుబడిదారీ వ్యవస్థలు వేళ్లూనుకున్నాయి. ఈ నయా అభివృద్ధి నమూనాలో ఆర్థికంగా బలోపేతమైన సామాజికవర్గాలదే ఆధిపత్యం. అణగారిన వర్గాలు మరింతగా అణచివేతకు గురవుతుండగా, ఆధిపత్యవర్గాలు సంపదను పోగుచేసుకుంటూ మరింత బలపడుతున్నాయి. ఈ వైరుధ్యమే ప్రస్తుత కులగణన డిమాండ్‌కు మూలకారణం. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, రిజర్వేషన్ ఫలాలను, విద్య, ఉపాధి అవకాశాలను ఓబీసీల్లో ప్రాబల్యం పొందిన వర్గాలే అనుభవిస్తున్నాయనేది చేదు వాస్తవం.

ఓబీసీలోని అనేక ఉపకులాలు మరింత నిరాదరణకు గురవుతున్నాయనేది అనేక కమిటీలు తేల్చి చెప్పిన నిష్ఠూర సత్యం. ఫలితంగానే అవకాశాలు మృగ్యమై.. ఆర్థిక చేయూత కరువై.. అభివృద్ధికి దూరంగా విసిరివేసిన అణగారిన వర్గాలు, ముఖ్యంగా ఇప్పటివరకు కొద్దోగొప్పో అభివృద్ధి ఫలాలను అనుభవించి ఆర్థికంగా ఎదిగిన బీసీల్లోని ప్రాబల్య శక్తులు ఇప్పుడు తమ గొంతు విప్పుతున్నాయి. కొన్ని వర్గాలు సంపదలో తమ వాటా కోసం, మరికొన్ని వర్గాలు అవకాశాల కోసం ముక్తకంఠంతో నిలదీస్తున్నాయి. కులగణనతోనే తమ ఆకాంక్షలు నెరవేర్చుకోవచ్చని, తమ బలాన్ని చాటుకోవచ్చని ఆశిస్తున్నాయి. అందుకే బీసీ కులగణనకు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఓబీసీల జనాభా గణనపై పూర్తి అధికారాలను రాష్ర్టాలకు కల్పించే బిల్లుకు ఇటీవల పార్లమెంట్ ఆమోదం తెలపడంతో మరోసారి కులగణన అంశం రాజకీయ చర్చగా మారిపోయింది. అనేక జాతీయ పార్టీలతో పాటు ప్రాంతీయ పార్టీలు సైతం కులాల వారీగా జనగణన చేయాలనే వాదాన్ని బలంగా వినిపిస్తున్నాయి.

దేశంలో తొలిసారిగా స్వాతంత్ర్యానికి పూర్వం 1872లో జనాభాను బ్రాహ్మణ, క్షత్రియ, రాజ్‌పుత్‌తో పాటు కులవృత్తుల వారీగా వర్గీకరించడంతో పాటు స్థానిక క్రైస్తవులను, ఆదివాసీ తెగలను గుర్తించారు. 1901 నాటి జనగణనలో 1,642 కులాలను, 1931లో 4,147 కులాలను గుర్తించారు. 1941లో రెండో ప్రపంచ యుద్ధం వల్ల కులగణన మధ్యలోనే నిలిచిపోయింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రతి పదేండ్లకోసారి జనగణనను కేంద్రం చేపడుతున్నా అందులో ఎస్సీ, ఎస్టీ కులాల సమాచారాన్ని మాత్రమే సేకరిస్తూ వస్తున్నాయి. కులగణన చేపట్టే విషయంపై జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు ఆది నుంచీ ద్వంద్వ వైఖరినే అనుసరిస్తున్నాయి.

**ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం గొంతు విప్పడం.. అధికారంలోకి వచ్చిన తర్వాత కమిషన్లను ఏర్పాటు చేసి, ఆపై విస్మరించడం పరిపాటిగా మారింది. ఎట్టకేలకు 2011లో మాత్రం మొత్తంగా 46 లక్షల కులాలు, ఉపకులాలు, గోత్రనామాల ఆధారంగా ప్రాంతాల వారీగా జనాభా లెక్కలను సేకరించినా సాంకేతిక కారణాలతో ఆ నివేదికను తొక్కిపెట్టింది అప్పటి కాంగ్రెస్ సర్కార్. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు ఆది నుంచీ కులగణనను, రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నది. ఈ విషయాన్ని గతంలోనూ, ఇప్పుడూ అనేక సందర్భాల్లో బాహాటంగా ప్రకటించింది.**

బీసీలకు వ్యతిరేకంగా అనేక నిర్ణయాలను తీసుకుంటున్నది కూడా. నాడు మండల్ కమిషన్ అమలును వ్యతిరేకించింది. నేడు కులాల వారీగా సమగ్ర వివరాలను సేకరిస్తే సమాజంలో చీలికలు ఏర్పడి, ఆయా వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తుతాయని సాకులు చెబుతూ కులగణనను నిరాకరిస్తుండటం గమనార్హం. మరోవైపు ఎస్సీ, ఎస్టీల లెక్కలను సేకరించడం విడ్డూరం.

దేశంలో మొత్తంగా లక్షల సంఖ్యలో కులాలు, ఉపకులాలున్నాయని, ఒక ప్రాంతంలో ఓసీలుగా, ఉన్నవారు మరో రాష్ట్రంలో బీసీలు, ఎస్టీలుగా ఉన్నారని, వాటి జనగణన అసాధ్యమని అసంబద్ధ వాదనలను వినిపిస్తుండటం ఆక్షేపణీయం. అయితే కులగణనకు జాతీయ పార్టీలు ఇంతగా ససేమిరా అనడానికి ప్రధాన కారణం వేరే ఉందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కులాల వారీగా జనగణన నిర్వహించినప్పుడు ఓబీసీల ప్రాబల్యం పెరగడంతో పాటు, తద్వారా ప్రస్తుత రిజర్వేషన్ల పరిమితిని కూడా పెంచాలనే డిమాండ్ వస్తుందని.. విద్య, ఉపాధి, రాజకీయాల్లో అగ్రవర్ణాల అవకాశాలకు గండిపడుతుందనేది వాటి భయం. అదే సత్యం.

2017లో ఏర్పాటు చేసిన రోహిణి కమిషన్ తన నివేదిక ద్వారా 97 శాతం ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా రిజర్వేషన్ల ఫలాలు కేవలం 25 బీసీ ఉపకులాలకే చెందుతున్నాయని తేల్చిచెప్పింది. 2,633 ఓబీసీ కులాలు రిజర్వేషన్ల ఫలాలు పొందడం లేదని, 983 కులాలకు అసలు ప్రాతినిధ్యమే లేకుండా పోయిందని నొక్కిచెప్పింది. ఈ నేపథ్యంలోనే ఓబీసీలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కల్పిస్తున్న 27శాతం రిజర్వేషన్లను మొత్తంగా 4 సబ్ క్యాటగిరీలుగా విభజించాలని చెప్పింది. అప్పుడే న్యాయం జరుగుతుందని స్పష్టం చేసింది.

ఇప్పటికైనా కేంద్రం కులగణన చేపట్టాలె. సబ్బండ బీసీ వర్గాలు ఆ దిశగా డిమాండ్ చేయాలె. కేంద్రం మెడలు వంచాలె. హక్కులను సాధించుకోవాలె. వాటాను తేల్చుకోవాలె. అన్నిటికంటే ముఖ్యంగా సమాజంలో 52 శాతంగా ఉన్న బీసీ కులాల అభ్యున్నతే దేశ ప్రగతి అనే వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలె. కులగణనకు మద్దతు ఇయ్యాలె.

**'అట్టడుగు వర్గాలకు ఏ రూపంలోనూ రిజర్వేషన్లు ఉండకూడదు. అనాదిగా సమాజంలో కొనసాగుతున్న ఈ నిచ్చెనమెట్ల కులవ్యవస్థ యథాతథంగా కొనసాగాలి. బడుగు, బలహీన వర్గాలు బానిసలుగానే బతుకులీడ్చాలి'.. ఇదీ క్లుప్తంగా బీజేపీ సిద్ధాంతం. ఇప్పుడే కాదు, ఎప్పుడైనా సరే అగ్రవర్ణ సామాజికవర్గం కాని వారెవరికీ బీజేపీ పబ్బతి పట్టదు. హక్కులను ప్రసాదించదు. ప్రయోజనాలను చేకూర్చదు. గడిచిన పదేండ్ల పాలనే అందుకు నిలువెత్తు నిదర్శనం. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కల్పన ఒక సజీవ సాక్ష్యం. ఇక ముందూ కాషాయ పార్టీ పాలన విధానం మారదనేది అక్షర సత్యం.**

ఇక నేడు దేశంలోని ఓబీసీల అధ్వాన్నస్థితికి, అవకాశాల లేమికి దేశాన్ని సుదీర్ఘకాలం పాటు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీనే కారణం. ఇప్పటికీ కాంగ్రెస్ అదే మోసపూరిత వైఖరిని ప్రదర్శిస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని ప్రకటించింది. చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చింది. కానీ, అధికారం చేపట్టిన తర్వాత మాటమార్చింది. కులగణన చేపట్టకుండా తెలంగాణ సామాజిక ఆర్థిక, రాజకీయ సర్వేను నిర్వహిస్తామని చెబుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి బీసీలను తప్పుదోవ పట్టిస్తున్నది కాంగ్రెస్ సర్కార్. వాస్తవంగా కులగణన కేంద్రం పరిధిలోని అంశం. కేంద్ర సర్కారు చేస్తేనే చెల్లుబాటవుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలకు కులగణన చేసే అధికారం లేదు. సామాజిక సర్వేలను నిర్వహించుకునే వెసులుబాటు మాత్రమే ఉంది. అయితే ఈ సర్వేల ఫలితాల కచ్చితత్వంపై అనేక అనుమానాలు, అపోహలు ఉండటంతో పాటు, అవకతవకలు జరిగే అవకాశమూ ఉన్నది. ఒక కులాన్ని ఎక్కువగా చూపించుకోవచ్చు, లేదంటే తక్కువగానూ చూపించుకోవచ్చు. ఇలాంటి ఆరోపణల నేపథ్యంలోనే బీహార్ ప్రభుత్వం చేసిన సర్వే అటకెక్కింది. ప్రస్తుతం ఏపీలో కొనసాగుతున్న సర్వేపైనా అనేక ఆరోపణలున్నాయి. అక్కడి రాజకీయ పార్టీలు, కుల సంఘాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు అలాంటి సర్వేనే కాంగ్రెస్ సర్కారు చేస్తామని అంటుండటం గమనార్హం. సూటిగా చెప్పాలంటే ఇక్కడ వర్గ స్వభావరీత్యా, పాలనా విధానాల పరంగా, వెనకబడిన వర్గాల ప్రయోజనాలను వ్యతిరేకించడంలో ఒకే రీతిన వ్యవహరించే బీజేపీ, కాంగ్రెస్‌లను తక్షణం విడనాడాలి.

**ఇక నేడు దేశంలోని ఓబీసీల అధ్వాన్నస్థితికి, అవకాశాల లేమికి దేశాన్ని సుదీర్ఘకాలం పాటు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీనే కారణం. ఇప్పటికీ కాంగ్రెస్ అదే మోసపూరిత వైఖరిని ప్రదర్శిస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని ప్రకటించింది. చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చింది. కానీ, అధికారం చేపట్టిన తర్వాత మాటమార్చింది. కులగణన చేపట్టకుండా తెలంగాణ సామాజిక ఆర్థిక, రాజకీయ సర్వేను నిర్వహిస్తామని చెబుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి బీసీలను తప్పుదోవ పట్టిస్తున్నది కాంగ్రెస్ సర్కార్.**

**దేశానికి నూతన అభివృద్ధి నమూనాను చూపి, కొత్త ఎజెండాతో ముందుకువస్తున్న, హక్కుల సాధనకు బీసీలకు బాసటగా నిలుస్తున్న, గొంతు కలుపుతున్న నూతన శక్తులతో ఏకం కావాలె. బీసీ హక్కులకు స్పష్టమైన హామీనిచ్చే ప్రజాస్వామిక, ప్రగతిశీల, ప్రాంతీయ పార్టీల వెంట నడవాలి. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీల వైపే బీసీలు మొగ్గు చూపాలి. అది బీసీ వర్గాలకు అత్యవసరం. అత్యంత అవశ్యకం.**

(వ్యాసకర్త: జనతంత్ర వేదిక అధ్యక్షులు)



**గడ్డం సతీష్**
99590 59041

# కరీంనగర్ కదనభేరి.. ఓ కాగడా!

**2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో దేశంలో ఎన్నికల కోలాహలం మొదలైంది. అటు ఐదు దశాబ్దాలకుపైగా దేశాన్ని పాలించిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, ఇటు ఇప్పటికే రెండు దఫాలుగా అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ మళ్లీ మళ్లీ అధికారంలోకి రావాలనే ఆరాటంతో, ఆత్రుతతో వేయని ఎత్తుగడలు లేవు. గత తొమ్మిదిన్నరేండ్లుగా దేశంలోని ప్రజా సమస్యలు పట్టని రాహుల్‌గాంధీ ఎన్నికలు రాగానే 'భారత్ జోడో యాత్ర' పేరిట దేశ సంచారం చేస్తుంటే... అధికారం చేపట్టిన నాటినుంచి పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు, వ్యవసాయ నల్ల చట్టాలు, ధరల పెరుగుదలతో ప్రజలను నానా యాతనలకు గురిచేసిన ప్రధాని నరేంద్ర మోదీ 'సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్' (సీఏఏ) పేరిట దేశంలో కొత్త పాచిక విసరడానికి సిద్ధమవుతున్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు తాము ఆడిందే ఆట, పాడిందే పాటగా పాలనను అటకెక్కించి చోద్యం చూస్తున్నాయి.**

**ఉద్యమాన్ని ఎట్లా నడపాల్నో కేసీఆర్ నాయకత్వం గతంలో ఎరుకజేసింది. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల పక్షాన నిలబడి ఎట్లా పాలన సాగించాల్నో ఆయన చతురత మొన్నటిదాకా నిరూపించింది. ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చుంటే ప్రజల తరపున ఎట్లా కొట్లాడాల్నో తెలుపుతూ కేసీఆర్ చేసిన ప్రసంగం ద్వారా రాష్ట్ర ప్రజలకు 'నేనున్నాననే' భరోసా కలిగించింది. ప్రజల ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.**

2023 చివరలో రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ పార్టీ అత్తెసరు మెజారిటీతో అధికారాన్ని చేజిక్కించుకున్నది. అంతకుముందు తెలంగాణలో ఎలాగైనా బీజేపీ జెండా ఎగురవేయాలనే కుతూహలంతో ఆ పార్టీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ నుంచి మొదలు ఇతర రాష్ర్టాల ముఖ్యమంత్రుల దాకా తెలంగాణ రాష్ర్టాన్ని పర్యాటక ప్రాంతంగా ఎంచుకున్నారు. మోదీ మేనియా, ఆ పార్టీ ముఖ్యమంత్రుల శ్రమకు దక్కిన ఫలితం 8 అసెంబ్లీ సీట్లు. పుసుక్కున బీజేపీ అధికారంలోకి వస్తే తమకు ముఖ్యమంత్రి, మంత్రి పదవులు వస్తాయేమోననే ఆశతో అప్పటికే ఎంపీలుగా ఉన్న బండి సంజయ్, ధర్మపురి అరవింద్, సోయం బాపురావులు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఘోర పరాజయం చవిచూశారు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో ఆ పార్టీ బలమెంతో ప్రజలు చెప్పకనే చెప్పారు.

ఈ ఎన్నికల్లో ఒక్క కేసీఆర్‌ను గద్దె దించేందుకు ఎన్ని శక్తులు ఏకమయ్యాయో కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. 'మార్పు, మార్పు' అంటూ కొందరు కుహనా మేధావులు పని గట్టుకొని చేసిన అబద్ధపు ప్రచారం, కాంగ్రెస్ పార్టీ అలవిగాని హామీలు పాపం రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించాయి. ఫలితంగా కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీ స్వల్ప తేడాతో అధికారాన్ని కోల్పోయింది. ప్రజల నిర్ణయాన్ని శిరసావహించిన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు పంపించి సామాన్యుడి వలె ప్రగతిభవన్‌ను వీడారు. ముఖ్యమంత్రి కుర్చీ మీద కూర్చున్న రేవంత్‌రెడ్డి హుందాగా వ్యవహరించాల్సింది పోయి, తన స్థాయిని మరిచి దిగజారి మాట్లాడటం షురూ చేశారు. ప్రతిదాడికి సిద్ధమవుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను నిలువరించి కొత్త ప్రభుత్వానికి కొంచెం గడువు ఇవ్వాలని కేసీఆర్ ఆదేశాలు జారీచేయడం ఆయనకున్న రాజనీతిజ్ఞతను, తెలంగాణ పట్ల ప్రేమను మరోసారి తెలియజేసింది. అంతే, బీఆర్ఎస్ నాయకుల



మౌనం కాంగ్రెస్ నాయకులకు అస్త్రంగా మారింది. అధికారంలోకి వచ్చి సరిగ్గా మూడు నెలలు కూడా గడవకుండానే కాంగ్రెస్ నేతల ఆగడాలకు అడ్డులేకుండా పోయింది. ప్రజలకు ఇచ్చిన హామీలను అటకెక్కించడమే కాదు, ప్రజలు అప్పగించిన అధికారానికి అంధకార ముసుగు తొడిగి ఆ పార్టీ నాయకులు చేసిన వీరంగం అంతా ఇంతా కాదు. అది ఏ స్థాయికి చేరిందంటే 'రైతుబంధు ఏది సారూ..' అని రైతులు అడిగితే చెప్పుతో కొడతామని హెచ్చరించే స్థాయికి చేరింది. మంత్రులుగా ఆసీనులైన వ్యక్తులు జర్నలిస్టులపై నాలిక మడతపెట్టి బల్లలు గుద్దే స్థాయికి చేరింది. ఏకంగా ఒక మహిళా మంత్రి ఆధ్వర్యంలో తన పీఏ.. ముఖ్యమంత్రి ఫొటోలు లారీలకు అంటించి ఇసుకను తరలించడం షరామామూలైంది.

కాంగ్రెస్ ద్వితీయశ్రేణి నాయకులైతే ఏకంగా నేతన్నలను కండోమ్‌లు అమ్ముకొని జీవనం సాగించమని నీతులు చెప్పే స్థాయికి ఎదిగారు. ఇలా ఆకలితో ఉన్న పులికి మేకల గుంపు దొరికినట్టు.. పదేండ్లు అధికారానికి దూరమైన కాంగ్రెస్ నాయకులకు తెలంగాణ ప్రజలు ఒక అవకాశంగా దొరికారు.

'ప్రజలు ఏమైపోతే మాకేం అవసరం' అనుకున్నారో ఏమో.. 'మార్పు' పేరు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించిన కుహనా మేధావులు మెల్లగా పక్కకు జారుకున్నారు. అధికారానికి దాసోహమైన కొన్ని పత్రికలు కండ్లు మూసుకున్నాయి. అందుకే వాస్తవాలకు ముసుగు తొడిగి, అధికారానికి వత్తాసు పలుకుతున్నాయి. ఓ దిక్కు మేడిగడ్డ ఖాళీ అవుతుంటే దానికి అడ్డుకట్ట వేయమని చెప్పకుండా, బీఆర్ఎస్ ఖాళీ అంటూ వార్తలు వండి వారుస్తున్నాయి. అసలు బీఆర్ఎస్ ఖాళీ అయితే ఏంటి, నిండితే ఏంటి? ప్రజలకు మేలు చేసే కాళేశ్వరం ప్రాజెక్టును సవరించి రైతులకు నీళ్లు ఇవ్వాల్సింది ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కాదు గదా? అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కదా! అధికార కాంగ్రెస్ పార్టీ ఓ దిక్కు మీడియాను పంచన పెట్టుకొని, ఇంకో దిక్కు కుహనా మేధావుల మెడలు పట్టుకొని చేస్తున్న అరాచకాలకు అంతే లేకుండాపోయింది. ఏకంగా 'ఉప ముఖ్యమంత్రి' స్థాయి వ్యక్తి అనే సోయి మరిచి, కేవలం దళిత వర్గానికి చెందిన వ్యక్తి అని యాదాద్రి ఆలయంలో చిన్నపీట వేసి కూర్చోబెట్టేంత అజ్ఞానం, అహంకారం కాంగ్రెస్ నాయకులను ఆవరించడం నిజంగా బాధాకరం.

**'మార్పు, మార్పు' అంటూ ఎన్నికలకు ముందు మమ్మల్ని మాయ జేస్తే మా జీవితాల్లో ఇంకెంత మార్పు వస్తుందోనని భ్రమ పడ్డాం.., కానీ మా జీవితాలు అంధకారంలో కూరుకుపోయేలా మార్పు వస్తుందని ఊహించలేదు' అంటూ మూడు నెలల తర్వాత ప్రజలు లబోదిబోమని మొత్తుకోవడం మొదలైంది.**

కాంగ్రెస్ పాలన ఈ స్థాయిలో ఉంటుందనుకోలేదని ఇప్పుడు ఏకరువు పెడుతున్నారు. మూడు నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం రావణకాష్ఠంలా తయారైంది. నీళ్లు లేక పొలాలు ఎండిపోతున్నాయి. ఆ ఎండిపోయిన పొలాలకు గొడ్డూ గోదలను తోలుతున్నది రాష్ట్ర రైతాంగం. రైతుబంధు రావడం లేదంటూ రైతులు రచ్చకెక్కుతున్నారు. కల్యాణలక్ష్మి కనుమరుగైందంటూ తల్లిదండ్రులు కంటతడి తీస్తున్నారు. పింఛన్లు ఠంఛన్‌గా రావడం లేదంటూ వృద్ధులు ఫిర్యాదవుతున్నారు. బీమా అందడం లేదంటూ రైతుల కుటుంబాలు బావురుమంటున్నాయి. చెరువుల్లోకి నీళ్లు రావడం లేదని కర్షకులు చెమ్మగిల్లుతున్నారు. ఇంటింటికీ మంచి నీళ్లు రావడం లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మహిళలు ఈసడించుకుంటున్నారు. 'మా ఖర్మ కాకపోతే ఈ కాంగ్రెస్‌ను ఎందుకు ఎన్నుకున్నామా?' అంటూ రాష్ట్ర ప్రజలు లోలోపల మదనపడుతున్నారు.

ఈ సమయంలో తెలంగాణ ప్రజలకు ఒక దిక్సూచి అయ్యింది కరీంనగర్ గడ్డ. ముందుండి నడిపించే కాగడా అయ్యింది కరీంనగర్ 'కదనభేరి' బహిరంగ సభ. ఏ పార్టీ జెండా తమకు నీడనిస్తుందో.. ఏ నాయకుడు తమ నమ్మకాన్ని వమ్ము చేయడో 'కదనభేరి' బహిరంగ సభ తేల్చిచెప్పింది. ఉద్యమాన్ని ఎట్లా నడపాల్నో కేసీఆర్ నాయకత్వం గతంలో ఎరుకజేసింది. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల పక్షాన నిలబడి ఎట్లా పాలన సాగించాల్నో ఆయన చతురత మొన్నటిదాకా నిరూపించింది. ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చుంటే ప్రజల తరపున ఎట్లా కొట్లాడాల్నో తెలుపుతూ కేసీఆర్ చేసిన ప్రసంగం ద్వారా రాష్ట్ర ప్రజలకు 'నేనున్నాననే' భరోసా కలిగించింది. ప్రజల ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. కాంగ్రెస్ గత మూడు నెలల పాలన కారణంగా విసిగి వేసారిపోయిన ప్రజల మౌనం కేసీఆర్ మాటల తూటాలతో బద్ధలైంది. కరీంనగర్ 'కదనభేరి'లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగడుతూ ఉద్యమ నాయకుడు కేసీఆర్ చేసిన ప్రసంగం రాష్ట్ర ప్రజలను మళ్లీ పిడికిలి బిగించి 'జై తెలంగాణ' అని నినదించేలా చేసింది. తాము తప్పు చేశామని, భవిష్యత్తులో ఇలాంటి తప్పులు చేయబోమని, అందుకు రాబోయే పార్లమెంటు ఎన్నికలే సాక్షమని రాష్ట్ర ప్రజానీకం మాట్లాడుతుండటం నిజంగా ఒక శుభపరిణామం.